
సాక్షి
అనకాపల్లి
సోమవారం । 11 । డిసెంబర్ । 2023


ఆయిల్ రిగ్‌కు బాంబు పెట్టి తిరిగి వెళ్తున్న మార్కోస్

విన్యాసాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న నగర ప్రజలు



న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు


ఆశీర్వచనం స్వీకరిస్తున్న జస్టిస్ రాజశేఖర్, జస్టిస్ సుబ్బారెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.రాజశేఖర్, జస్టిస్ సుబ్బారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తులకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులు ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికలను, శేషవస్త్రాలను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

'సామాజిక సాధికార యాత్ర' వేదిక పరిశీలన


సభా వేదిక వద్ద ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, నాయకులు

బుచ్చెయ్యపేట : మండలంలోని మేజర్ పంచాయతీ అయిన వడ్డాదిలో కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర సభా వేదికను ఎమ్మెల్సీ, సామాజిక బస్సుయాత్ర ఇన్‌చార్జి ఆళ్ల అప్పిరెడ్డి, నవ రత్నాల పథకాల ఇన్‌చార్జి ఎ.నారాయణరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ తేదీ సాయంత్రం ఇక్కడ జరిగే సభకు వేల సంఖ్యలో హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు తదితరులకు వారు సూచించారు.

పెరిగిన కోనాం జలాశయం నీటిమట్టం


కోనాం జలాశయం

చీడికాడ: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం ఆరు రోజుల వ్యవధిలో 11 మీటర్లు పెరిగి, ఆదివారం సాయంత్రానికి 100 మీటర్ల సమీపానికి చేరింది. జలాశయం ప్రమాదస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.80 మీటర్లు ఉంది. ఇన్‌ఫ్లో 350 క్యూసెక్కులు ఉండడంతో 100 మీటర్లు దాటే వరకు నిల్వ చేసి, అనంతరం పరిస్థితిని బట్టి నీటిని విడుదలను చేస్తామని ఇరిగేషన్ ఏఈ జయరాం తెలిపారు.

మృత్యువులోనూ వీడని బంధం

- భర్త చనిపోయిన కొద్ది నిమిషాలకు భార్య మృతి
- ఉప్పవరంలో విషాదఛాయలు


మృతి చెందిన వృద్ధ దంపతులు

అచ్యుతాపురం(అనకాపల్లి): కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచారు. రెక్కలు ముక్కలు చేసుకుని కుటుంబాన్ని పోషించారు. వృద్ధాప్యంలో ప్రశాంతంగా గడపవలసిన తరుణంలో భర్త మృతిచెందాడు. భర్త మరణాన్ని తట్టుకోలేక ఆ వెంటనే భార్య కూడా మరణించిన విషాద సంఘటన మండలంలోని ఉప్పవరంలో చోటు చేసుకుంది. ఉప్పవరం గ్రామానికి చెందిన గంగిరెడ్డి సత్యనారాయణ(70) శనివారం రాత్రి మృతి చెందాడు. భర్త మరణించిన కొద్ది నిమిషాల్లోనే భార్య సత్యవతి (65) తనువు చాలించింది. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో ఓ కుమారుడు గతంలో మృతిచెందాడు. ఒకే రోజు దంపతులు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వారి అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు.


యుద్ధ విమానాలు



సాగరంలో సంబరం



జనగణమన ఆలపిస్తున్న గవర్నర్ నజీర్, మంత్రులు రజని, అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున

- అబ్బురపరిచిన నేవీ విన్యాసాలు
- పరాక్రమాన్ని చూపిన తూర్పు నావికాదళం
- ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ నజీర్
- సందర్శకులతో కిటకిటలాడిన ఆర్.కె.బీచ్


బాంబులను జారవిడుస్తున్న విమానం


తీరంలో హెలికాప్టర్ల విన్యాసాలు


దూసుకొస్తున్న హాక్స్


జనసంద్రంగా సాగరతీరం

బీచ్‌రోడ్డు: సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగనతలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రుమూకలపై మార్కోస్ ఉప్పెనలా దాడి.. దూసుకొచ్చిన మిసైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. మొత్తంగా ఆర్.కె.బీచ్ రణరంగాన్ని తలపించింది. ఒళ్లు గగుర్పొడిచేలా నిర్వహించిన నేవీ విన్యాసాలు.. ఉవ్వెత్తున ఎగిసిపడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. నింగి, నేలా తేడా లేదనేలా సాగిన విన్యాస ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన ప్రజలు.. సరికొత్త అనుభూతిని పొందారు. నేవీ డే పురస్కరించుకుని ఆర్.కె.బీచ్‌లో ఆదివారం జరిగిన తూర్పు నౌకాదళ విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ముందుగా సభా వేదిక వద్ద ముఖ్య అతిథులు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లను తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ స్వాగతం పలికారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించేలా మూడు బాంబులను పేల్చి విన్యాసాలను ప్రారంభించారు.

కిటకిటలాడిన తీరం: నేవీ విన్యాసాలు చూసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రజలు లక్షలాదిగా తరలిరావడంతో తీరంలో పండగ వాతావరణం నెలకొంది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. తీరంలో ఎల్‌ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.


బోట్లపై తీరానికొస్తున్న మార్కోస్

పటిష్ట ఏర్పాట్లతో విజయవంతం

లక్షలాది మంది ప్రేక్షకులు విన్యాసాలను చూసేందుకు వస్తారని అంచనా వేసిన అధికారులు, పోలీసులు అందుకు తగ్గట్లుగా భారీ ఏర్పాట్లు చేశారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా గ్యాలరీలను ఏర్పాటు చేయడంతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు కల్పించారు. విన్యాసాలను చూసేందుకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు.






బాంబు పెట్టి ఆయిల్ రిగ్‌ను పేల్చిన మార్కోస్


స్కై డైవ్ చేస్తున్న సైనికుడు


ప్రజలను బంధించిన ఉగ్రవాదులు


నేవీ విద్యార్థుల నృత్య ప్రదర్శన


విన్యాసాలు తిలకిస్తున్న నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

ప్రదర్శన సాగిందిలా..

- సముద్రం నుంచి తీరం వైపునకు ఐదు హాక్స్ యుద్ధ విమానాలు దూసుకొచ్చి బాంబుల వర్షం కురిపించాయి.
- నిశ్శబ్దంగా దూసుకొచ్చిన ఐఎన్‌ఎస్ సింధుశాస్త్ర సబ్‌మెరైన్ నుంచి సెయిలింగ్ పాస్ట్ నిర్వహించారు.
- ఆయిల్ రిగ్‌ను పేల్చేందుకు ఓ హెలికాప్టర్‌లో మార్కోస్ వచ్చి తాడు సాయంతో చిన్న బోట్లలోకి దిగారు. అనంతరం రిగ్‌కు బాంబులు అమర్చారు. మళ్లీ హెలికాప్టర్ ఎక్కి రిమోట్ ద్వారా ఆయిల్ రిగ్‌ను పేల్చి.. సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించారు.
- ఉగ్రవాదుల వద్ద బందీగా ఉన్న ప్రజలను రక్షించే ప్రదర్శన ఒళ్లు గగుర్పొడిచేలా సాగింది. మార్కోస్ ఉగ్రవాదులపై విరుచుకుపడి ప్రజలను రక్షించారు.
- రెండు యుద్ధ ట్యాంకర్లతో శత్రుసేనపై దాడి చేసిన విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి.
- యుద్ధం జరిగే సమయంలో నౌకలపై అత్యవసరంగా హెలికాప్టర్లను ఎలా ల్యాండ్ చేస్తారో చేసి చూపించారు. కదులుతున్న మూడు నౌకలపై మూడు హెలికాప్టర్లను విజయవంతంగా ల్యాండ్ చేశారు. అనంతరం యుద్ధ నౌకల నుంచి రాకెట్లను ప్రయోగించారు.
- ప్రమాదవశాత్తూ సముద్రంలో చిక్కుకున్న వారిని మూడు చేతక్ హెలికాప్టర్లపై సైనికులు వచ్చి రక్షించిన ప్రదర్శన అద్భుతంగా సాగింది.
- అనంతరం తూర్పు నావికాదళానికి చెందిన ఆయుధ సంపత్తిని ప్రదర్శించారు. గగనతలంలో యుద్ధవిమానాలు, హెలికాప్టర్లు చేసిన విన్యాసాలను సందర్శకులు కళ్లార్పకుండా చూశారు.
- నేవీ బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకుంది. చివరిగా యుద్ధ నౌకల్లో విద్యుత్ దీపాలను వెలిగించి విన్యాసాలు ముగించారు.

'పేట' ప్రజలకు టీడీపీ వెన్నుపోటు

- ఎన్నికల ముందు హామీలిచ్చి గెలిచాక పట్టించుకోని నేతలు
- నీటి మీద రాతలుగా చంద్రబాబు హామీలు
- టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలకే పరిమితం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,550 కోట్లతో సంక్షేమం, రూ.578.4 కోట్లతో అభివృద్ధి పనులు

హామీలంటే.. టీడీపీ అధినేత చంద్రబాబుకు కేవలం ప్రజలను నమ్మించే మాయమాటలే.. ఓట్లు రాల్చుకోవడానికి ఉపయోగపడే ఓటి మాటలే. ఎడాపెడా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలుచేయకుండా ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు మహా నేర్పరి. మేనిఫెస్టో అంటే టీడీపీకి టిష్యూ పేపర్‌తో సమానం. పాయకరావుపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, నిర్మాణాలు చేపడతామని 2014 ఎన్నికల ముందు టీడీపీ హామీ ఇచ్చింది. ఆ మాటలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు అధికారంలోకి వచ్చిన తరువాత వెన్నుపోటు పొడిచింది. ఆ హామీలన్నింటినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలోనే అమలుచేసింది.


నక్కపల్లిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం

సాక్షి, అనకాపల్లి: 2014 ఎన్నికల్లో ఎడాపెడా హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో హామీలను నెరవేర్చకుండా పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలను నిలువునా మోసం చేశారు. అభివృద్ధిని కేవలం శిలాఫలకాల ఆవిష్కరణలకే పరిమితం చేశారు. టీడీపీ హయాంలో రూ.92 కోట్లతో పనులు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారు. ఆ పనులను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చేసి చూపించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పాయకరావుపేట నియోజకవర్గంలో హామీలిచ్చి, నెరవేర్చలేని వాటిని పూర్తిచేయడంతో పాటు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.1,550 కోట్ల సంక్షేమం, రూ.578.4కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమాభివృద్ధి పనులు

➡ పాయకరావుపేట నియోజకవర్గంలో డీబీటీ, నాన్ డీబీటీలో 29 సంక్షేమ పథకాలకు ప్రభుత్వం రూ.1,550 కోట్లు ఖర్చుచేసింది.


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన పాయకరావుపేట వై జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు

➡ ప్రతి గ్రామంలో అర్హులకు రూ.20 కోట్లకు పైగా లబ్ధి చేకూర్చింది.

➡ గడప గడపలో మన ప్రభుత్వం కార్యక్రమం కింద పనులకు రూ.24 కోట్లు, రోడ్ల నిర్మాణానికి రూ.16 కోట్లు, జల్ జీవన్ మిషన్‌కు రూ.200 కోట్లు, నాడు–నేడు పనులకు రూ.106 కోట్లు కేటాయించి, పనులు పూర్తి చేశారు. నాడు–నేడులో 136 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు.

➡ రూ.8.40 కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునికీకరించారు.

➡ 9 వేల మంది పేదలకు రూ.200 కోట్లకు పైగా విలువైన ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అందులో భాగంగానే పాయకరావుపేటలో 42 ఎకరాల్లో మెగా లేఅవుట్ ఏర్పాటు చేసి 1,420 మందికి ఒకే చోట ఇళ్ల స్థలాలు కేటాయించారు.

➡ రూ.24 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు మంజూరు చేశారు.

తాజాగా మంజూరు చేసినవి


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన పాయకరావుపేట పీహెచ్‌సీ భవనం

➡ 1,100 ఎకరాల్లో డ్రగ్ పార్కు

➡ నక్కపల్లి మండలం రేబాక నుంచి కోటవురట్ల మండలం అల్లుమియాపాలెం వరకూ 10 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్లు

టీడీపీ హయాంలో నెరవేర్చని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తి చేసిన పనులు

➡ పాయకరావుపేట టౌన్‌లో వై జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తామని టీడీపీ ప్రభుత్వంలో హామీ ఇచ్చారు. ఆ హామీ కేవలం మాటలకే పరిమితమైంది. 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్ల పాటు రోడ్డు వేయకుండా నిర్లక్ష్యం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే ఈ రోడ్డును విస్తరించడానికి నిధులు మంజూరు చేస్తే.. స్థానిక టీడీపీ నాయకులతో న్యాయస్థానంలో కేసు వేయించి ఆటంకం కలిగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో స్థానిక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చొరవతో పాత టెండర్‌తో పనిలేకుండా కొత్తగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రూ.2.95 కోట్లతో 2 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు.

➡ నక్కపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని 2014లో టీడీపీ హామీ ఇచ్చింది. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, విస్మరించింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. 28 మంది అధ్యాపకులను పూర్తిస్థాయిలో నియమించారు.

➡ టీడీపీ హయాంలో నక్కపల్లిలో సీహెచ్‌సీని 50 పడకలఆస్పత్రిగాఅప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చా రు. కనీసం శంకుస్థాపన కూడా చేసిన పాపానపోలేదు. 20పడకలున్న సీహెచ్‌సీని 50పడకల ఆస్పత్రిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్‌గ్రేడ్ చేయ డంతో పాటు, రూ.3 కోట్లతో మౌలికసదుపాయ లు, ఆధునిక ల్యాబ్, హృద్రోగాలకు సంబంధించి అధునాతన టెక్నాలజీ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు.

➡ టీడీపీ ప్రభుత్వంలో పాయకరావుపేటలో ఉన్న పీహెచ్‌సీకి కొత్త భవనాన్ని నిర్మిస్తామని, మంగవరం పీహెచ్‌సీని ఆధునికీకరిస్తామని హామీలు గుప్పించారు. దాన్ని కూడా ఐదేళ్లలో పూర్తిగా టీడీపీ నిర్లక్ష్యం చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.30 కోట్లతో నూతన భవనాలు నిర్మించి, 2023 ఏడాదిలో ప్రారంభించింది. మంగవరం పీహెచ్‌సీని రూ.77 లక్షలతో ఆధునికీకరించింది.

➡ నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు 2009లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.26 కోట్లతో శ్రీకారం చుట్టారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం, 2014లో టీడీపీ ప్రభుత్వం రూ.50 కోట్లతో నిర్మాణానికి శిలాఫలకాలు ఏర్పాటుచేశాయి. పనులు ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేశాయి. దీన్ని పూర్తి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.85 కోట్లు మంజూరు చేసింది. పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఇది పూర్తయితే 107 గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుంది.

➡ టీడీపీ ప్రభుత్వ హయాంలో కోటవురట్ల మండలంలో కందూరు, జల్లూరు బ్రిడ్జిలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీనీ గాలికొదిలేశారు.

16న దివ్యాంగులకు రూ.1.62 కోట్ల పరికరాల పంపిణీ


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఈ నెల 16న 1,343 మంది దివ్యాంగులకు రూ. 1,62,83,656 విలువచేసే పరికరాలను కేంద్ర ప్రభుత్వ(ఎల్‌ఎన్‌కో సంస్థ) సాయంతో ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు ఎంపీ బి.వి.సత్యవతి తెలిపారు. స్థానికఎంపీ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గతంలో పరికరాల పంపిణీకి దివ్యాంగులకు మెడికల్ క్యాంపులు నిర్వహించినట్టు చెప్పారు. ఆ క్యాంపులో ఎంపికైన దివ్యాంగులకు 3,042 పరికరాలను అందజేస్తామని, కొంతమందికి రెండు మూడు పరికరాలను ఇవ్వనున్నామని తెలిపారు. ఎంపీ కోటా నిధులు రూ.32.60 లక్షలతో 192 మందికి బ్యాటరీ సైకిళ్లను అందజేయనున్నట్టు చెప్పారు. ఒక్కో సైకిల్ విలువ రూ.42వేలు ఉంటుందని తెలిపారు. మాన్యువల్ సైకిళ్లను 122 మందికి అందజేయనున్నామని, వాటికి భవిష్యత్తులో బ్యాటరీ ఏర్పాటు చేసే విధంగా పరికరాలు అమర్చనున్నట్లు ఆమె చెప్పారు. రెండో విడత దివ్యాంగుల మెడికల్ క్యాంపును త్వరలో ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామన్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఆమె చెప్పారు. మన రాష్ట్రంలో నిర్వహిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ల గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంతగానో మెచ్చుకుందని చెప్పారు. రైతు పండించిన పంటకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేయించి పంటనష్టానికి నగదు చెల్లించే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతులను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

క్లుప్తంగా

రూ.2 కోట్లతో సీటీ స్కాన్ యంత్రం ఏర్పాటు



ఎన్టీఆర్ వైద్యాలయంలో కొత్త సీటీ స్కాన్ మిషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రామ్మూర్తి

అనకాపల్లిటౌన్: ఎక్కువగా బడుగు, బలహీన వర్గాల ప్రజలే వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వస్తారని, అలాంటి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి, వారి మన్ననలు పొందాలని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్, డాక్టర్ జి.శ్రీరామ్మూర్తి సూచించారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతిల చొరవతో రూ.2 కోట్ల నిధులతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీటీ స్కాన్ యంత్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు పదేళ్లగా వైద్యాలయంలో సీటీ స్కాన్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తోందన్నారు. తాజాగా ఏర్పాటు చేస్తున్న సీటీ స్కాన్ యంత్రం మరో 15 రోజుల్లో రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

చెట్టు మీదపడి వ్యక్తి మృతి




సత్తిబాబు మృతదేహం

కోటవురట్ల: ప్రమాదవశాత్తు చెట్టుమీద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ నారాయణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పందూరు గ్రామానికి చెందిన శానాపతి సత్తిబాబు(65) కూలి పనులు చేస్తుంటాడు. ఆదివారం సహచర కూలీలతో కలసి రామచంద్రపురం శివారు అల్లుమియ్యాపాలెం గిరిజన గ్రామంలో పనులకు వెళ్లాడు. జీడి తోటలో నీలగిరి చెట్టునరికి తాడుతో లాగుతుండగా అది ప్రమాదవశాత్తూ సత్తిబాబుపై పడిపోయింది. దీంతో సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ఉత్సవంలో కోలాటమాడుతున్న దాససాహిత్య మహిళా బృందం



స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనం

చోడవరం: శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుని కల్యాణం కన్నుల పండువగా ఆదివారం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో భారీ సెట్టింగ్‌ల మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. చోడవరం వేద ఆశ్రమం, శ్రీనివాస శరణాగతి మండలి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కేవస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన 12 మంది వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. తిరుమల నుంచి తీసుకొచ్చిన శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసుని పంచలోహ ఉత్సవ విగ్రహాలకు రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించి, భారీ సెట్టింగ్‌తో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వేలాది మంది భక్తుల మధ్య స్వామివారి కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కుటుంబసమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కల్యాణాన్ని చూసేందుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కల్యాణాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్లు గ్రౌండ్‌లో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేశారు. గోవింద నామస్మరణతో కల్యాణవేదిక ప్రాంగణమంతా మార్మోగింది. తిరుమల, తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు బృందం పురందరదాసు కీర్తనలు ఆలపించింది. ఈ కార్యక్రమంలో శరణాగతి మండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా టూఫాన్ ఆటల పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు బాలికల ఎంపిక



టూఫాన్ ఆటల పోటీలను తిలకిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ



బాలికలనుద్దేశించి మాట్లాడుతున్న ఏఎంఏఎల్ కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు

అనకాపల్లి రూరల్: నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంఏఎల్ కళాశాల క్రీడామైదానంలో రెండ్రోజులు జరిగిన జిల్లా స్థాయి టూఫాన్ ఆటల పోటీలు ఆదివారం ముగిసాయి. నాన్హి కలి ప్రాజెక్టు పేరుతో ప్రతి ఏటా 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు మాత్రమే ఈ ఆటల పోటీలు నిర్వహిస్తారు. జిల్లాలో వివిధ సచివాలయాల పరిధిలో పలు అంశాల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలకు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నిర్వాహకులు అవకాశం కల్పించారు. ఈ నెల 9న ప్రారంభమైన ఈ పోటీల్లో సుమారు 100 మంది బాలికలు పాల్గొన్నారు. 50 మీటర్ల స్ప్రింట్, నిలబడి లాంగ్ జంప్, షటిల్ రన్, ఎండ్యూరెన్స్ రన్ ఈవెంట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో రాణించే బాలికలను జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఆటల పోటీల ముగింపు కార్యక్రమంలో ఆటల్లో పాల్గొన్న బాలికలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ, ఏఎంఏఎల్ కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికల శక్తి యుక్తులను పెంపొందించుకోవడానికి, క్రీడల్లో వారిని ప్రోత్సహించడానికి టూఫాన్ ప్రస్తుత సీజన్ ఆటల పోటీలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు.

సరుగుడు జలపాతానికి పోటెత్తిన సందర్శకులు



సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల సందడి



కొండకర్ల ఆవలో బోటులో విహరిస్తున్న సందర్శకులు

నాతవరం: కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో సరుగుడు జలపాతానికి సందర్శకులు పోటెత్తారు. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్య నుంచి జాలువారే జలపాతంలో జలకాలాటాడేందుకు పోటీపడ్డారు. అనంతరం సమీపంలో శివలింగాన్ని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సందర్శకులు రావడంతో ఈ ప్రాంతమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహలం నెలకొంది. చిన్నా పెద్దా తేడా లేకుండా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వనసమారాధనలో భాగంగా కొంతమంది సంహపంక్తి భోజనాలు చేశారు. అదేవిధంగా తాండవ రిజర్వాయరుకు సందర్శకుల తాకిడి కనిపించింది. తాండవ ప్రాజెక్టును తిలకించేందుకు పెద్ద ఎత్తున వీరు తరలి వచ్చారు. ఇక్కడ ప్రాజెక్టు దిగువన నల్లకొండమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు.

కొండకర్ల ఆవ, తంతడి బీచ్‌కు పోటెత్తిన జనం

అచ్యుతాపురం(అనకాపల్లి): కార్తీక మాసం నాల్గవ ఆదివారం పిక్నిక్ స్పాట్‌లు సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. మండలంలోని కొండకర్ల ఆవ, తంతడి బీచ్‌కు భారీగా తరలివచ్చారు. స్నేహితులు, పలు క్లబ్‌ల సభ్యులు ఇక్కడకు వచ్చి ఆటపాటలతో సందడి చేశారు. తంతడి బీచ్‌లో స్నానాలు చేశారు. కొండకర్ల ఆవలో బోటు షికారు చేసి ఆవ అందాలను ఆస్వాదించారు.

అవరోధాలు ఎదురైనా ఆత్మస్థైర్యం వీడొద్దు



దివ్యాంగులకు ల్యాబ్‌టాప్‌లు అందజేస్తున్న ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్

అనకాపల్లిటౌన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ట్రైనీ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ అన్నారు. గవరపాలెం గౌరీసేవాసంఘం మళ్ల జగన్నాథరావు కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ అధైర్యపడకూడదన్నారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు గ్రూప్‌లుగా ఏర్పడి రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు ఎన్నో సంక్షేమకార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, వాటిని పొందేందుకు అందరికీ అవగాహన కల్పించి, సహాయం చేస్తున్న పి.ఎస్.తిరుపతి పట్నాయక్ కృషి అభినందనీయమన్నారు. ఆర్‌పీడీ చట్టం సభ్యుడు పి.ఎస్.తిరుపతి పట్నాయక్ మాట్లాడుతూ ఆగిపోయిన ప్రభుత్వ పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు. అనంతరం యువతీయువకులకు ప్రభుత్వం మంజూరు చేసిన సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలను ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అందజేశారు. అంతకుముందు బాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విభిన్నప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు బి.వి.జగదీష్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల విభిన్నప్రతిభావంతుల ఇన్‌ఛార్జి ఇమ్మందుల వెంకటరమణ, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్, నాయకులు వేదుల చంద్రశేఖర్, దుగ్గిరాల రవికుమార్ పాల్గొన్నారు.

నేడు పాయకరావుపేటలో లోకేష్ ప్రవేశం

మహారాణిపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో అడుగు పెడుతోంది. సాయంత్రం 5.30 గంటలకు పాయకరావుపేటలోకి లోకేష్ ప్రవేశిస్తారు. అక్కడ నుంచి జడియో షోరూమ్ వద్ద, హైవే ముఖద్వారం వద్ద స్థానికులతో సమావేశం, రాత్రి 7 గంటలకు పి.ఎల్.పురం వద్ద యువతతో సమావేశం, 7.30 గంటలకు సీతారాంపురంలో స్థానికులతో సమావేశం, 8 గంటలకు నామవరం క్యాప్ సైట్ వద్ద విడిది కేంద్రంలో లోకేష్ బస చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

డ్యాన్స్‌తో అదరగొట్టిన పూర్వ విద్యార్థులు

పెదబొడ్డేపల్లి గురుకులంలో ఉత్సాహంగా ఆత్మీయ కలయిక



డాన్స్ చేస్తున్న డాక్టర్ రామచంద్రరావు, పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: వారంతా ఐదు పదుల వయసులో కుర్రకారు అయిపోయారు. సినీ గీతాలకు హుషారైన స్టెప్పులతో అదరగొట్టారు. విద్యార్థి దశ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలు, ముచ్చట్లతో మునిగి తేలారు. తమకు విద్యను బోధించిన గురువులను సన్మానించుకున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆట, పాటలతో ఆద్యంతం సందడిగా సాగింది. ఇక్కడ గురుకులంలో 1985–86లో పదో తరగతి చదివి డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్లు, లాయర్లు, సాఫ్ట్‌వేరు నిపుణులు వంటి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారంతా తమ పాత జ్ఞాపకాలను కలబోసుకున్నారు. ఒకరి యోగ క్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఏటా పాఠశాలలో సమావేశమవడంతోపాటు పాఠశాలకు, విద్యార్థులకు తమవంతు చేయూతనందించి నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుత ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పూర్వ గురువు ఎస్.వెంకటరెడ్డితోపాటు అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.రామచంద్రరావు రెట్టించిన ఉత్సాహంతో తోటి పూర్వ విద్యార్థులతో కలిసి సినీ గీతాలకు తనదైన శైలిలో స్టెప్‌లు వేసి అదరగొట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుల బడిలో ఆనందంగా గడిపారు. పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం వల్ల నేడు ఉన్నత స్థానాలకు ఎదగగలిగామని ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్రరావు ప్రస్తుత విద్యార్థులకు వివరించారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమలాగే చదువుకుని పది మందికి సహాయపడాలని సూచించారు.

గంజాయి తీసుకెళ్తున్న ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం : గంజాయి తీసుకెళ్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు రూరల్ ఎస్‌ఐ ధనుంజనాయుడు తెలిపారు. వివరాలివి. నెల్లిమెట్ట వద్ద మెయిన్ రోడ్డుపై ఎస్‌ఐ, సిబ్బంది ఆదివారం వాహన తనిఖీలు చేస్తున్నారు. గబ్బాడ వైపు నుంచి నడిచి వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి వారి వద్ద ఉన్న బ్యాగ్‌లు తనిఖీ చేయడంతో గంజాయి బయటపడింది. తమిళనాడు రాష్ట్రం, శివగంగ జిల్లాకు చెందిన జయకుమార్ శంకరన్(21), ఈశ్వరన్ రాజ్‌కుమార్ (21), అంబరీష్ విజయకుమార్(19)ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 13 కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి తమిళనాడు తీసుకెళ్లి చిన్న చిన్న పొట్లాల చొప్పున విక్రయిస్తారని విచారణలో వెల్లడైందని ఎస్‌ఐ తెలిపారు.

గడ్డపార పట్టిన కొత్తకోట సీఐ

- జె.నాయుడుపాలెం రోడ్డులో గోతులు పూడ్చివేత



జె.నాయుడుపాలెం రోడ్డులో గోతులు పూడ్చుతున్న సీఐ ఇలియాస్ మహమ్మద్

రోలుగుంట: ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలతో మండలంలో పలురోడ్లపై గోతు లు పూడ్చివేత పనులను పోలీసులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు బీఎన్ రోడ్డుతోపాటు శివారు గ్రామాల రోడ్లకు గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో పోలీసులు వాటిని పూడ్చే పనులు చేపట్టారు. కొత్తకోట సర్కిల్ పరిధి జె.నాయుడుపాలెం మార్గంలో కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ రాతి బుగ్గిని తెప్పించి పొక్లెయిన్‌తో పూడ్చివేయించారు. స్వయంగా తానే గడ్డపార పట్టి గోతులు పూడ్చారు. రోలుగుంట మండల కార్యాలయాల కూడలి నుంచి గ్రామ సరిహద్దు వరకు గోతులను ఎస్సై ఎల్.సురేష్‌తో కలిసి పూడ్చివేయించారు. ఈ సందర్భంగా వాహన చోదకులు కృతజ్ఞతలు తెలిపారు.

కరక రంగురాళ్ల క్వారీలో తవ్వకాలకు పాల్పడిన ఇద్దరి అరెస్టు



రంగురాళ్ల తవ్వకందారులతో అటవీ సిబ్బంది

నర్సీపట్నం: గొలుగొండ మండలం కరక రంగురాళ్ల క్వారీ ప్రాంతంలో తవ్వకాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు డీఎఫ్‌వో లక్ష్మణ్ తెలిపారు. కరక రంగురాళ్ల క్వారీ ప్రాంతంలో మట్టిని తవ్వుకుని తీసుకువస్తుండగా అటవీశాఖ సిబ్బంది ఇద్దరు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద ఉన్న మూడు మట్టి మూటలను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. గొలుగొండ మండలం కొత్తయల్లవరం స్వీపర్ జల్లు నూకరాజు(58), బుచ్చెయ్యపేట మండలం, తోటకూరపాలెంకు చెందిన కాపారపు ప్రసాద్(28)లు ఆదివారం క్వారీ పరిసరాల్లో మట్టిని తవ్వుకుని తీసుకువస్తుండగా తమ సిబ్బంది అరెస్టు చేశారని డీఎఫ్‌వో తెలిపారు.

జూ ఆదాయం రూ 7.89 లక్షలు



జూలో సందర్శకులు

ఆరిలోవ(విశాఖ): కార్తీకమాసం ఆఖరి ఆదివా రం జూ పార్కు సందర్శకులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు జూను సందర్శించి.. రోజంతా సరదాగా గడిపారు. పిల్లలు, పెద్దలు, పాఠశాల విద్యార్థులు ఇక్కడ పిక్నిక్‌లు జరుపుకొన్నారు. అమెరికన్ చిలకలు, నెమళ్లు, ఆస్ట్రిచ్‌లు, ఈమూలు వాటి అరుపులతో పిల్లలను అలరించాయి. పులులు, సింహాలు, ఏనుగులు, కోతు లు, చింపాజీలు, ఎలుగుబంట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఆదివారం ఒక్క రోజు 10,109 మంది జూను సందర్శించినట్లు క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వారి ద్వారా రూ 7.89లక్షల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

మిలట్రీ కాలనీలో చోరీకి యత్నం



చోరీ కోసం గునపంతో తెరిచిన తలుపు




చోరీకి యత్నించిన ఇంటిలో అద్దెకుంటున్న వారితో మాట్లాడుతున్న పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణంలోని మిలట్రీ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగ చోరీకి యత్నించాడు. ఆ ఇంట్లో నివాసముంటున్న రౌతు శ్రీరాం కుటుంబం విజయనగరం జిల్లా రామభద్రపురంలో బంధువుల వివాహానికి వారం రోజుల క్రితం వెళ్లారు.ఈ విషయాన్ని గమనించిన దొంగ ఆదివారం రాత్రి ఇంటి పక్కనున్న పశువుల పాకలో గునపాం తెచ్చి ఇంటి తలుపు,కిటికీ పగులగొట్టాడు. ఇంట్లోకి ప్రవేశించి ఎంత వెతికినా బంగారం, డబ్బు, ఇతర విలువైన వస్తువులేవీ దొరక్కపోవడంతో అక్కడ్నుంచి పరారయ్యాడు. చోరీకి యత్నించిన వ్యక్తి అంతకుముందు కాలనీలో పలు ఇళ్లలో కూడా దొంగతనానికి వెతకడం ఓ ఇంటి ముందున్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సుమారు 35 సంవత్సరాల వయసున్న వ్యక్తి,చొక్కా లేకుండా దొంగతనాలకు యత్నించడాన్ని గుర్తించామని పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. సీసీ కెమెరాల పుటేజి ఆధారంగా ఈ చోరీకి యత్నించిన వ్యక్తి పాత నేరస్తుడా? మరొకరా అన్నది గుర్తిస్తున్నామని, ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని చెప్పారు. పట్టణంలో రాత్రి వేళల్లో ఎవరైనా అపరిచిత, అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్టు తెలిస్తే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కాగా చోరీ జరిగిన ఇంట్లో నివాసముంటున్న రౌతు శ్రీరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

విద్యార్థిని కేసులో బాధ్యులపై చట్టపరమైన చర్యలు

- అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు



మాడుగుల : ఈ నెల 3వ తేదీన మైనర్ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడని, గ్రామానికి చెందిన డి.చిన్నపై ఆమె కుటుంబ సభ్యులు అందించిన ఫిర్యాదు మేరకు 5వ తేదీన కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అనకాపల్లి డీఎస్పీ వి. సుబ్బరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. కాగా ఈ విషయమై అదే రోజు సాయంకాలం కొంత మంది యువకులు గొడవకు దిగారని, ఆ గొడవలో నిందితుడు దిమిలి చిన్నతో పాటు గుణసాయిలు, బి. శ్రీనును కత్తెర లాంటి ఆయుధంతో స్వల్పంగా గాయపరిచారని మరో ఫిర్యాదు అందిందన్నారు. కాగా తగాదాను విడిపించడానికి వెళితే తనను అక్రమంగా కేసులో ఇరికించారని, మనస్తాపం చెందిన గుణసాయి తన ఇంట్లో ఉన్న చీమల మందు తాగి ఈ నెల 9వ తేదీన ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందేనన్నారు. ప్రస్తుతం గుణసాయి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతను డిశ్చార్జి అయిన వెంటనే పూర్తి స్థాయిలో విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ తాతారావు, ఎస్‌ఐ దామోదర నాయుడు పాల్గొన్నారు.

జూకు కొత్త జంతువులు



చౌసింగ



మౌస్ డీర్లు

ఆరిలోవ(విశాఖ): ఇందిరా గాంధీ జూ పార్కుకు ఆదివారం కొత్త జంతువులు వచ్చాయి. కొద్దిరోజుల్లో ఇవి సందర్శకులను అలరించనున్నాయి. ఇటీవల ఇందిరాగాంధీ జూ పార్కు అధికారులు.. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో కాకతీయ జూ పార్కును సందర్శించారు. జంతుమార్పిడికి ఒప్పందం చేసుకుని.. అక్కడి నుంచి మూడు మౌస్ డీర్‌లు, మూడు చౌసింగ(నాలుగు కొమ్ముల జింక)లను ఆదివారం తీసుకొచ్చారు. వాటికి బదులుగా ఇక్కడి నుంచి మూడు హగ్ డీర్లు, మూడు బార్కింగ్ డీర్లు, నాలుగు లుటినో పారాకీట్లను కాకతీయ జూ పార్కుకు పంపించారు.

క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని సత్యనారాయణపురం–1 సచివాలయం పరిధిలో సోమవారం సాయంత్రం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయ పరిధిలో చేసిన అభివృద్ధి, లబ్ధిదారులకు అందించిన సంక్షేమ వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డు, ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. మండల పరిధి సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఘనంగా అంబలం పూజ


అయ్యప్పస్వామి పూజచేస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి పంబ పీఠం వద్ద శనివారం రాత్రి అయ్యప్పస్వాముల అంబలం పూజ ఘనంగా జరిగింది. గురుస్వాములు ఒమ్మి రాము, బుదిరెడ్డి మురళీకృష్ణ, పూజస్వామి పెదిరెడ్ల రమేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో సుమారు 200 మంది అయ్యప్ప మాలధారులు పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. 18 మెట్లను ఏర్పాటు చేసి, వాటిపై హారతి వెలిగించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తిలు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వాములకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో స్వాములు మద్దాల రమణ, ముత్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లిటౌన్:మండలంలోని మామిడిపాలెం హైస్కూల్లో 100 మంది పూర్వ విద్యార్థులు ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మీయ విద్యార్థి సేవ అధ్యక్షుడు పల్లా రాజు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏటా మూడుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సేవ గౌరవాధ్యక్షుడు కేవీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు సింహాచలం, కార్యదర్శి గొల్లవిల్లి శ్రీను, కోశాధికారి మొల్లి మురళి, సభ్యులు పిల్లా సురేష్, కృష్ణ, ఎం.రమేష్, కొరువాడ వెంకటేష్‌పాల్గొన్నారు.

పంట నష్టంపై నివేదిక

సబ్బవరం: గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులు మిచాంగ్ తుపాను ప్రభావంతో నీటి ముంపునకు గురైన వరి పంటను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. 240 ఎకరాల వరకూ నీట మునిగిన పంటలను గుర్తించారు. నీటి ముంపునకు గురైన పంట నష్టం నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్	: సత్యనారాయణస్క్రీన్-1
-------	: సత్యనారాయణస్క్రీన్-2
ఆనిమల్	: షిర్డిసాయి
హాయ్ నాన్న	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్ పార్టీ	: శ్రీసత్య
కోటబొమ్మాళి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. బీ పాజిటివ్–8 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్–10 యూనిట్లు, ఏబీ పాజిటివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 281 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 253 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.


ప్రైవేటు పరిశ్రమల సహకారంతో తవ్వించిన బయ్యవరం పెద్ద చెరువులో చేరిన నీరు



కశింకోటలో 66 చెరువుల అభివృద్ధి

పూడిక తొలగింపుతో పుష్కలంగా నీరు

మండలంలో రూ.5.68 కోట్లతో పనులు

ఉపాధి పనులతో జల సిరులు

గ్రామాలన్నీ దాదాపు వ్యవసాయాధారమే. సాగునీటి కాలువలున్న చోట మినహా మిగిలిన గ్రామాల్లో వ్యవసాయానికి మూలాధారం చెరువులు, బావులే. అందుకే ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువుల అభివృద్ధికి నడుం బిగించింది. వ్యవసాయ పనుల్లేని సమయంలో గ్రామీణులకు ఉపాధితోపాటు, భూగర్భ జల మట్టాల పెంపునకు తోడ్పడింది. దీంతో ప్రధానంగా చెరువులు, బావులపై ఆధారపడే కశింకోట మండలంలో జల సిరులు కళకళలాడుతున్నాయి.

కశింకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ ఉపాధి హామీ పథకంలో నాలుగేళ్లలో 66 చెరువులను అభివృద్ధి చేశారు. పూడికలు తొలగించారు. గట్లను పటిష్టం చేశారు. ఇందుకు రూ.5.68 కోట్లు వెచ్చించారు. అత్యధిక శాతం సాగునీటి చెరువుల్లో పూడికలు తొలగించి అభివృద్ధి చేశారు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అంది పంటలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చేలా చేపల చెరువులనూ తవ్వించారు.

పరిశ్రమల సహకారంతో..

బయ్యవరంలో పెద్ద చెరువు కింద సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉంది. దీని అభివృద్ధికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి చొరవ తీసుకున్నారు. దీంతో మూడేళ్ల క్రితం అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన ఏషియన్ పెయింట్స్, అంబుజ సిమెంటు పరిశ్రమలు ముందుకు వచ్చాయి. సుమారు 20 లక్షలతో ఈ చెరువుని అభివృద్ధి చేశాయి. దీంతో ఆయకట్టుకు సాగునీరు ఏటా పుష్కలంగా అందుతోంది. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువు నిండకపోయినా.. ఇటీవల మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులో నీరు చేరి కళకళలాడుతోంది.


చెరకాంలో తవ్విన సాగునీటి చెరువు


ఇ.చౌడువాడలో ఉపాధి పథకంలో తవ్విన సాగునీటి చెరువులో నీటి కళకళ

చేపల చెరువులతో పంచాయతీలకు ఆదాయం

సాగునీటి చెరువులే కాకుండా పంచాయతీలకు ఆదాయపు వనరులు పెంచేందుకు చేపల చెరువులపైనా దృష్టి సారించారు. బయ్యవరంలో రెండు, చెరకాం, జమాదులపాలెంలలో ఒక్కొక్కటి వంతున చేపల చెరువులను తవ్వారు. వీటిలో చేపల పెంపకానికి వేలం వేయడం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా పంచాయతీల అవసరాలకు వినియోగించుకుంటున్నారు. వ్యవసాయానికి మాత్రమే కాకుండా స్థానికుల అవసరాలను గుర్తించి చెరువుల్ని అభివృద్ధి చేస్తున్నారు. దీంతో సేద్యానికి, వందలాది మంది కూలీల ఉపాధికి చెరువులు దోహదపడ్డాయి.

మండలంలో చెరువుల వివరాలు

గ్రామ పంచాయతీలు	27
చెరువుల అభివృద్ధి జరిగిన గ్రామాలు	14
మొత్తం అభివృద్ధి చేసిన చెరువులు	66

గ్రామాలవారీగా చెరువుల అభివృద్ధి

ఇ.చౌడువాడ	13
అడ్డాం	12
సుందరయ్యపేట	8
తీడ	8
బయ్యవరం	5
అచ్చెర్ల	5
చింతలపాలెం	5
చెరకాం	3
నూతలగుంటపాలెం	2
బుచ్చియ్యపేట	1
జి.భీమవరం	1
పరవాడపాలెం	1
ఉగ్గినపాలెం	1
జెట్టపురెడ్డితుని	1

పంటల సాగుకు చెరువే ఆధారం



కోనేరు చెరువును పూడిక తీసి అభివృద్ధి చేశారు. దీనివల్ల వర్షపు నీరు పుష్కలంగా చేరి, ఆయకట్టు భూముల్లో పంట సాగుకు అవసరమైన నీరందించేందుకు ఉపయోగపడుతోంది. ఈ చెరువు కింద అర ఎకరం వరి, అర ఎకరం చెరకు పంటలను పండిస్తున్నాను. చెరువు పూడిక తొలగింపు పనులు చేపట్టిన ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– కోన చినఅబ్బాయి, రైతు, జెట్టపురెడ్డితుని

భూగర్భ జలాలు పెరిగాయి



నాకు రెండెకరాల పొలం ఉంది. ఉపాధి హామీ పథకంలో చెరువుల్లో పూడికతీత వల్ల నీటి నిల్వలు పెరిగాయి. భూగర్భ జలాల నీటి మట్టం కూడా బాగా పెరిగింది. బోర్లు, బావుల్లో నీటిని వ్యవసాయ మోటార్ల ద్వారా తోడుకుంటూ, పంటల్ని సాగు చేస్తున్నాం. ఈ ఏడాది మిచాంగ్ తుపాను సమయంలో కురిసిన వర్షాలకు చెరువుల్లో బాగా నీరు చేరింది.

– నారిపల్లి పరశురాముడు, రైతు, నరసింగబిల్లి

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి'


కొత్తపల్లి సభలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

కశింకోట: పేదరికం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రధాని మోదీకి పేదల కష్టాలు తెలుసని, అందుకే వారి సంక్షేమానికి 17 రకాల పథకాలను అమలుచేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఏయే పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందో అధికారులు వివరించారు. విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యానాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఎంఈవో మూర్తి, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు శ్యాం, కోన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం


రత్నాకర్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: మండలంలోని పాపయ్యసంతపాలెంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు రత్నాకర్‌ను శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో గ్రామస్తులు బొట్టా అప్పలరాజు, మొల్లి మంగబాబు, రమణబాబు, ముమ్మల సతీష్, బొడ్డపాటి చినరాజారావు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామికి రుద్రాభిషేకం నేడు

కశింకోట: స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం, మాస శివరాత్రి పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా 1008 కొబ్బరికాయలు, పంచామృతాలు, పండ్ల రసాలు, గంధం, విభూది, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. బిల్వ పత్రాలు, వివిధ రకాల పరిమళ పుష్పాలతో స్వామిని అలంకరిస్తామన్నారు. సాయంత్రం విశేష దీపాలంకరణ జరుగుతుందన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం కార్తీక సమారాధన


గోపూజలో సుందరరాజ్ పెరుమాళ్, తదితరులు

అనకాపల్లిటౌన్: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సూర్యనారాయణ, సత్యనారాయణమూర్తి దేవాలయం ఆవరణలో ఏపీ చాత్తాద శ్రీ వైష్ణవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, శ్రీ భాగవతుల చాత్తాద శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన జరిగింది. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు టి.సుందరరాజ్ పెరుమాళ్ దైనందిన జీవన విధానంలో తీసుకోవాల్సిన మార్పులను వివరించారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేబి ప్రతిస్నేహలతచే కూచిపూడి నృత్య ప్రదర్శన చేపట్టారు. అనంతరం కుటుంబ సమేతంగా కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు డాక్టర్ పి.జగన్ మోహన్‌రావు, తొండా గీతాంజలి నారాయణమూర్తి, పరాంకుశము ప్రమీలా నరసింహమూర్తి, రమ బాజీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

అనకాపల్లిటౌన్: క్షణికావేశంలో చిన్నచిన్న తప్పిదాల కారణంగా కొంతమంది జైలు జీవితాన్ని అనుభవిస్తారని హోప్‌ఫర్ ఇండియా పాస్టర్ దేవా అన్నారు. స్థానిక సబ్ జైల్‌లో ఆదివారం నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రేమతో నిండిన జీవితం గడపాలని, పొరుగు వారిపట్ల ప్రేమాభిమానం కలిగి ఉండాలన్నారు. నేరాలు చేసి జైలుకు వచ్చిన వారు తమ తప్పుల్ని తెలుసుకుని మంచి జీవిత విధానాన్ని అవలంభించాలని సూచించారు. అనంతరం కేక్ కట్‌చేసి, ఫ్రూట్స్, రొట్టెలు, టవల్స్ ఖైదీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గణేష్ రెడ్డి, క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు.



13న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

కశింకోట:విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం రెండు సబ్ డివిజన్లకు కలిపి ఈ నెల 13న ఉదయం 10 గంటలకు అగనంపూడి సెక్షన్ కార్యాలయంలో జరగనుందని కశింకోట ఏపీఈపీడీసీఎల్ డీఈఈ ఎస్.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో చైర్మన్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, పరిష్కారం పొందవచ్చన్నారు. అగనంపూడితోపాటు మండలంలోని తాళ్లపాలెం విద్యుత్ సబ్–డివిజన్‌కు చెందిన వినియోగదారులు ఈ వేదిక ఆధారంగా తమ ఫిర్యాదులను నివేదించుకోవచ్చన్నారు.

కాశీవిశ్వేశ్వరునికి లక్ష బిల్వార్చన


లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు


శివలింగానికి లక్ష బిల్వార్చన

అనకాపల్లిటౌన్: దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం త్రయోదశిని పురస్కరించుకుని ఆదివారం శివలింగానికి ప్రత్యేక పూజలు జరిపారు. పంచామృత అభిషేకాలు, లక్షబిల్వార్చన, కుంకుమ పూజ, కల్యాణాన్ని ఆలయ అర్చకులు ఉమా, కృష్ణ, మత్యలింగంలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాటికొండ కామేశ్వరరావు, ఈవో కీర్తి ఆదినారాయణ, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. పూజాకార్యక్రమాల అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు.

నేడు భోగలింగేశ్వరుడికి బిల్వార్చన

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు మాసశివరాత్రి పురస్కరించుకుని స్వామివారికి బిల్వార్చన, లక్ష కుంకుమార్చన, గోపూజ, సూర్యనమస్కారాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, మృత్యుంజయ రుద్రహోమం, జ్యోతిలింగార్చన, పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తుల కోసం పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు పూజల్లో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

వైభవంగా భూలోకమాంబ పండగ


అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించేందుకు వెళ్తున్న గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో కొలువైన శ్రీభూలోకమాంబ అమ్మవారి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు భారీ ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, ఉప సర్పంచ్ గొర్లి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు, కొల్లి దాసు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళల హక్కులు కాపాడాలి


వసతిగృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా నేత వరలక్ష్మి

అనకాపల్లి రూరల్: మహిళల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా నేత డీడీ వరలక్ష్మి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో మానవ హక్కుల పరిరక్షణ, మహిళా చట్టాల అమలుతీరుపై జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా నిత్యం మహిళలపై హింస, దాడులు జరుగుతూనే ఉండడం దురదృష్టకరమన్నారు. చట్టాలను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగిన తర్వాత అశ్లీల వీడియోల వీక్షణ ద్వారా యువత పెడదోవ పడుతున్నారని వాపోయారు. ముఖ్యంగా టీవీ సీరియళ్లు, సినిమాల్లో మహిళలను విలన్లుగా చిత్రీకరించడంతో సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు ఉంటోందని పలు విద్యార్థి సంఘాల నాయకులు తమ ప్రసంగాల్లో అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ కార్యక్రమాల వలన యువతకు ఉద్యోగావకాశాలు తగ్గిపోయి, నిరుద్యోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయండి

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్‌ను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక పూడిమడక రహదారిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొత్త ఉద్యోగులకు జీపీఎస్ పద్ధతిని ప్రవేశపెట్టడం వలన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పాత పింఛన్ పద్ధతిని కొనసాగించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 10 మంది ఉద్యోగులు గుండు గీయించుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాది సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి గరిమి రాజేష్, ఉపాధ్యాయ నేత డి.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

